ఎందుకు దిగిపోవాలి అన్నదే ప్రశ్న. అలా అయితే భారత ప్రభుత్వమే స్వయంగా ఈ మహారాజులను తొలగిస్తే బాగుంటుంది కదా. కాశ్మీర్ ఇండియా ప్రెసిడెంట్ అధికారాలకు లోబడి ఉండాలి. కాని అలా జరగటం లేదు. కారణం ప్రెసిడెంట్ బేగ్ స్టేట్‌మెంటే-
"Autonomous Republic within the Indian Union" with its own "Constitution. President, National Assembly and separate Judiciary"

దీని అర్థమేమిటో మరి తెలియటం లేదు.

ఈ సందర్భంలోనే పండిట్‌జీ జూన్ 21న పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో ఏదేమైనా సంస్థానం ఇండియాలో అంతర్భాగమేనని ప్రకటించారు. ఈ విధంగా పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

అదే సభలో ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ నెహ్రూజీ సంస్థానానికి వేరే ధ్వజము ఉండవచ్చునన్నారు. కొన్ని విషయాలకు సమాధానమివ్వలేదు.

కాని అదే రోజున, అనగా జూన్ 21న మైసూరులో ఒక మార్పు జరిగింది. మైసూరు ప్రత్యేక పతాకకూ, ప్రత్యేక జాతీయ గీతానికి స్వస్తి చెప్పబడుతుందని శ్రీ హనుమంతయ్య ప్రకటించాడు. కాని పండిట్‌జీ ఉంటే ఉండ వచ్చంటారు. ఇలా పండిట్‌జీ విస్పష్టంగా సమాధానమివ్వలేదు.

ఈ పరిస్థితులన్నీ చూస్తే కాశ్మీర్ విషయాన్ని శంకించేది మత సంస్థలని పిలువబడే సంస్థలే కాదు, ప్రతి రాజకీయవేత్త శంకిస్తూనే ఉన్నాడు.

ఇప్పటినుంచైనా భారత ప్రభుత్వం జాగ్రత్త పడటం చాలా అవసరం. మతతత్వ వాదులనే పేరుతో లేనిపోని అభాండాలు వేసి, నిజమైన భారతీయ మిత్రమైన ప్రజాపరిషత్‌ను నిందించటం అనవసరం. ఏది ఏమైనా కాశ్మీర్ ఇండియాలో అంతర్భాగమే అన్న నెహ్రూజీ ప్రకటన కాశ్మీర్ సమస్యను దాదాపు పరిష్కరించిందని చెప్పవచ్చు మిగతా విషయాల్లో కూడా కాశ్మీర్‌ను మామూలు సంస్థానము వలెనే చూడాలి. కాని దానికి ప్రత్యేక ప్రతిపత్తి అంటూ ఏదీ లేదు. ఇండియాలో కాశ్మీర్ చేరింది గాని, కాశ్మీర్‌లో ఇండియా చేరబోవటం లేదనే విషయాన్ని మనం గమనించాలి.

స్కెచ్

# విచిత్రమైన మనుషులు

జి. వి. జి. కృష్ణ

నేను హైస్కూల్లో చదివే రోజుల్లో మాకొక అతిస్ట్రిక్టయిన హెడ్‌మాస్టరు ఉండేవారు. టీచర్లు స్కూలుకు ఒక్క నిముషం ఆలశ్యంగా వచ్చారంటే చాలు--వాళ్ళ అటెండెన్స్ రిజిష్టర్‌లో ఎర్రనామం పెట్టేవాడు. క్లాసులో పాఠాలు జరిగే సమయాల్లో, ఏ స్టూడెంటయినా స్కూలు వరండాలో తిరుగుతూండటం చూశాడంటే, వెంటనే వాడిని తన గదిలోకి పిలిపించి బెత్తంతో చావబాదేవాడు.

ఆపూట మాకు సైన్సుక్లాసు. మా సైన్సు మాస్టారుకి సదా కిళ్ళీలు నములుతూండటం పరిపాటి. అవి కాస్తా నోట్లో లేకపోతే ఆయన పాఠం చెప్పడం చాలా చప్పగా ఉండేది. మా అందరికీ ఆవలింతలు ముంచుకొచ్చేవి. ఆ రోజు ఏదో ఒక ప్రయోగం చేయబోతూ, ఆయన ఎన్ని అగ్గిపుల్లలు పాడుచేసినా సారాదీపం వెలగకపోయింది. దాదాపు సగం పెట్టె ఖాళీ ఐపోయాక, మా సీనుని పిలిచి, స్కూల్ పక్కనే ఉన్న కొట్టుకెళ్ళి ఒక కిళ్ళీని తెమ్మని ఒక అర్డణా ఇచ్చి పంపించాడు. వాడు వెళ్ళిపోయాక మళ్ళీ సారాదీపం వెలిగించాడు మా మేస్టారు. ఈమారు అది వెలిగింది. కిళ్ళీని తేవడానికి వెళ్ళిన సీనూ ఎంతసేపటికీ రాకపోయేసరికి, నిట్టూరుస్తూ ఆ ప్రయోగాన్ని చేయడం మొదలెట్టాడు. మేమందరమూ కళ్ళప్పగించి చూస్తూ ఆ ప్రయోగంలో నిమగ్నులమైపోయాం.

ప్రయోగమంతా ఐపోయేసరికి, మేమందరమూ మళ్ళీ ఈలోకానికి వచ్చిపడటమూ, మా

వెనుక చివరి బెంచీపైన సీనూ నిలుచోనుండటం చూసి ఆశ్చర్య చకితులంకావటమూ అన్నీ ఒకేసారి జరిగిపోయాయ్.

“ఎందుకురా బెంచీ ఎక్కి నిలుచున్నావ్? కిళ్ళీ ఏదీ!” అని దాదాపు తెల్లబోతూనే ప్రశ్నించాడు మా కిళ్ళీ మేస్టారు.

సీనూ ఉన్నట్లుండి వెక్కి వెక్కి ఏడుస్తూ “కాదుసార్... నేను కిళ్ళీ తెచ్చేందుకని పెద్ద గేటుముందుగా వెళ్తూంటే, హెడ్‌మాస్టరు గారు నన్ను పిలిచి, ఎక్కడికెళ్లుతున్నావని అడిగారు. చెప్పాను దీనికని. క్లేస్ కెళ్ళి, ఈ వారం వరకూ సైన్స్ క్లాసొచ్చినప్పుడల్లా బెంచీఎక్కి నిలుచోవాలని ఆయన అన్నారు సార్” అని వాడు ఏడుస్తూ చెప్పేసరికి, మా సైన్స్‌మాస్టారి గొంతులో పచ్చివెలక్కాయపడ్డది.

ఇలావుంటుంది స్ట్రిక్ట్ మనుష్యుల ప్రవర్తన. కటువుగా మాట్లాడే మనుష్యులను చూస్తే నాకు అమిత రోతవేస్తుంది. వాళ్ళతో “ఏం— అంటే–ఏం” అన్న న్యాయంతో మెలుగుతూంటాను నేను

కట్టె విరిచి పొయ్యిలో పెట్టినట్లు, కొంతమంది అతి కఠినంగా మాట్లాడుతూంటారు. అదేదో గౌరవాన్ని సంపాదించి పెట్టుతుందనే ఆశతో కొంతమంది ఎల్లప్పుడూ అతిసీరియస్‌గా ఉంటుంటారు. మరి కొంతమంది స్వతహాగా ఖచ్చితమైనవ్యక్తులు కాకపోయినా, పైకిమాత్రం అమిత కఠినంగా వ్యవహరిస్తూంటారు. మొత్తం మీద ఈ “స్ట్రిక్ట్‌నెస్” అనే భూతం అన్ని తరగతుల ప్రజల్లోనూ, కొంతమందిని పట్టి ఉంటుందనే చెప్పాలి. అంతవరకూ ఎందుకూ, మా ఇంట్లోని పనిమనిషికూడా కొద్దిగా ఖచ్చితమైనదనే చెప్పాలి. ఎంచేతంటే ఫస్టు తారీకు రాగానే, దాని కూలి డబ్బుల్ని మొహాన పారెయ్యకపోతే ఇక ఆవేళ ఏ పనీ ముట్టుకోక ఇంటికి వెళ్ళిపోతుంది. ఇలాంటి ఖచ్చితమైన మనస్తత్వం గల వ్యక్తులు సంఘానికో విధంగా చీడపురుగులంటాను నేను.

ఎక్కడికెళ్ళినా ఈలాటి చీడపురుగులు తప్పేటట్లు లేదు నాకు. నేను ఒక ఆఫీసులో గుమాస్తాగా చేరిన కొత్తలో ఒక స్ట్రిక్టయిన మేనేజరు ఉండేవాడు. తెలిసిన వేళా విశేషం వల్ల ఓరోజు నా ఆఫీసు పనినంతా త్వరగానే ముగించేశాను. ఆ రోజయినా త్వరగా ఇల్లు చేరుకుని, మా ఆవిడను సినిమాకు పిలుచుకు పోదామనుకున్నాను. కాని, అంత త్వరగా నేను వెళ్ళిపోతే ఏం రాద్ధాంతం జరుగుతుందోనన్న భయంతో, నాలుగు గంటలకే పని ముగించిన వాడిని, నాలుగూ యాభై అయిదు వరకూ అలాగే నా సీటులోనే ఉండిపోయా. ఇంకా ఒక అయిదు నిమిషాలేకదా ఉండేదనుకొని, మెల్లిగా మేడ మెట్లుదిగి గేటు వద్దకు వచ్చేసరికి, అక్కడ ఎవరో మిత్రులతో మాట్లాడుతూ నిలుచున్న మేనేజర్ని చూసేసరికి గుండెదడ పట్టుకుంది. ఏం చేయడానికి తోచక వెర్రి మొహం వేసుకొని, స్తబ్ధుడై ఆలాగే అక్కడే నిలబడిపోయా. అప్రయత్నంగా నన్ను చూసిన ఆయన “ఓ. ఎస్. వెళ్ళొచ్చు” అని తప్పుకొని నాకు దారితీశాడు. ఆ స్థితిలో నాకేమీ పాలుపోక పోయింది. ఆయన ఆ మాటన్నప్పుడు గమ్మునే తలవొంచుకొని వెళ్ళిపోవల్సినవాడ్ని, నా తలపొగరు కొద్దీ నేరుగా వెళ్ళిపోక, దగ్గరే ఉన్న కిటికీ గుండా గోడ గడియారం వంక తొంగిచూసి “ఇంకా మూడు నిమిషాలు ఉన్నాయి లెండి సార్” అనేశాను. నేను కూడా ఏదో మహా ఖచ్చితమైన మనిషిలా. అంతే ఆయన మొహం ఎర్రబారింది “అయితే మీరు అప్పుడే ఎందుకు దిగి వచ్చేశారూ! వెళ్లి మీ సీటులో కూర్చొని అయిదు కాంగానే దిగిరాండి” అని కోపంతో గర్జించాడు. నా మొహాన కత్తి నాటుకు నెత్తురు చుక్కలేకపోయింది. చచ్చినట్లు తలవొంచుకొని మేడమెట్టెక్కి నాసీటులో వెళ్లి కూర్చున్నా.

ఈ నిక్కచ్చిగావుండే మనుష్యులలో కొందరిని, ఒకందుకు మెచ్చుకోక తప్పదు. వీరిలో సర్వసాధారణంగా అందరూ కోపిష్టులుగానే ఉంటారు. చెప్పొచ్చేదేమిటంటే, ఆకోపావేశంలో వారు, ఎదుటవాళ్ళ మనసులను గాయపరిచారనుకోండి, కానీ వారేం చేస్తారంటే, కొంతసేపటికల్లా తను తప్పిదాన్ని గుర్తించి, పశ్చాత్తాపంచెంది, ఒక్కోసారి వెంటనే క్షమాపణలుకూడా వేడుకుంటూంటారు.